GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 194 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 04-01-2025 | పేజీలు : 3

## గవర్నర్‌గా అజయ్ కుమార్ భల్లా ప్రమాణస్వీకారం

**టీ మీడియా, జనవరి 3, న్యూఢిల్లీ:**



కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లామణిపూర్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య స్థానంలో గవర్నర్‌గా భల్లా బాధ్యతలు చేపట్టనున్నారు. జూలై 2023 నుంచి లక్ష్మణ్ ప్రసాద్.. ఇంచార్జ్ గవర్నర్‌గా చేసిన విషయం తెలిసిందే.1984 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన భల్లాది.. అస్సాం %-% మేఘాలయా క్యాడర్. ఆగస్టు 2024 వరకు అయిదేళ్ల పాటు ఆయన కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా చేశారు. వాస్తవానికి భల్లాది పంజాబ్‌లోని జలంధర్. అయితే మణిపూర్ గవర్నర్‌గా ఆయన్ను నియమించడం ఆసక్తిగా మారింది. 2023 మే నుంచి మణిపూర్ వర్గ హింసతో రగిలిపోతున్న విషయం తెలిసిందే.మణిపూర్ గవర్నర్‌గా భల్లాను నియమిస్తూ డిసెంబర్ 24వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఇంఫాల్‌లో భల్లాకు అరుదైన గౌరవం దక్కింది. మణిపూర్ డీజీపీ రాజీవ్ సింగ్ నేతృత్వంలోని బృందం ఆయనకు స్వాగతం పలికింది.



## రైతుబంధు లో అవినీతి జరిగితే విచారణకు రెడీ

- రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

**టి మీడియా, జనవరి 3, హైదరాబాద్ బ్యూరో :**

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని కాంగ్రెస్ అంటోందని.. ఈ క్రమంలోనే రైతుబంధును తీసేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. రైతు బంధు పంపిణీలో రూ.22 వేల కోట్ల అవినీతి జరిగిందని అంటున్నారు.. మరి ఆ డబ్బులు ఎక్కడికి పోయాయో చెప్పాలని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.26,500 కోట్లు ఎగ్గొట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రైతుబంధు పంపిణీలో అవినీతి జరిగితే విచారణ జరిపించండని డిమాండ్ చేశారు. ఎవరికి అక్రమంగా రైతుబంధు నిధులు ఇచ్చామో లెక్కలు తీయండని ప్రభుత్వానికి సవాల్ చేశారు. రైతుబంధుపై రైతులను అప్రమత్తం చేయాలని కార్యకర్తలను కోరుతున్నానని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా ఇప్పించాల్సిన బాధ్యత మనపై

మిగతా 3లో..

# జనాభా పెరుగుదలకు అనుగుణంగా అభివృద్ధి

- జల మండలి బోర్డు మీటింగ్‌లో సీఎం రేవంత్



**టి మీడియా,జనవరి 3,హైద్రాబాద్ బ్యూరో :**

2050 నాటికి పెరిగే జనాభా అవసరాలకు తగినట్టుగా హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరాకు మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అధ్యక్షతన హైదరాబాద్ జలమండలి బోర్డు తొలి సమావేశం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగింది. తాగునీటితో పాటు భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా సివరేజీ ప్రణాళికను రూపొందించడంలో ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు.ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో జనాభాకు సరిపడే విధంగా తాగునీటి సరఫరా చేస్తున్నామని, నీటి సరఫరాకు నగరంలో మొత్తం 9.800 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ద్వారా 13.79 లక్షల కనెక్షన్లతో నీటి సరఫరా చేస్తున్నట్టు సమావేశంలో అధికారులు వివరించారు. నగరానికి మంజీరా, సింగూరు, గోదావరి, కృష్ణా నుంచి నీటి సరఫరా జరుగుతుండగా, గోదావరి ఫేజ్ 2 ద్వారా మరింత నీటిని తరలించి ఉస్మాన్‌సాగర్ , హిమాయత్‌సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది. హైదరాబాద్ తాగునీటి అవసరాలకు సంబంధించి కన్సల్టెన్సీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నీటి లభ్యత, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే గోదావరి ఫేజ్-2 తాగునీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తరలించేలా మార్పులకు ఆమోదం తెలిపారు. హైదరాబాద్ జలమండలి ఆదాయ వ్యయాల నివేదికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, జలమండలి తమ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని, అందుకు అనుసరించాల్సిన విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. జలమండలి కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్లు తయారు చేయించాలని చెప్పారు. నగరంలో పలు ప్రాంతాలకు మంజీరా ద్వారా 1965 నుంచి నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లకు కాలం చెల్లిన నేపథ్యంలో ప్రత్యామ్నా యంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశం లో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికు మారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పిడనల పై పోరాడిన వీరనారి సావిత్రిభాయి పూలే

- సీఎం రేవంత్ రెడ్డి నివాళులు

**టి మీడియా,జనవరి 3,హైద్రాబాద్ బ్యూరో :**

మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, కుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయురాలికి ఘనంగానివాళులుఅర్పించారు. మహిళల విద్యకు ఆద్యురాలిగానిలిచి, సమానత్వానికి పోరాడిన సావిత్రిబాయి పూలే గారి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్న తరుణంలో మహిళాఉపాధ్యాయులందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.సావిత్రి బాయి పూలే ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు. భారత సమాజంలో చారిత్రాత్మకమైన మార్పుకు సావిత్రిబాయి పూలే గారు పునాది వేశారని అన్నారు. లింగ వివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని అన్నారు.సావిత్రిబాయి ఆశయాలను సాధించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. మహిళల సాధికారత, ఆడబిడ్డలకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు అవసరమైన నైపుణ్యాల వృద్ధికి ప్రజా ప్రభుత్వం ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. బీసీలు, బడుగు, బలహీన వర్గాల సామాజిక, రాజకీయ అభ్యున్నతికి రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి సర్వేను ఇటీవలే పూర్తి చేసిందని అన్నారు.వారి త్యాగానికి, కృషికి గుర్తింపుగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళా టీచర్లు సావిత్రిబాయి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రతి ఏడాది ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు.





## చైనాలో మరో కొత్త వైరస్ కలకలం

- కొవిడ్ తరహా లక్షణాలతో
- అందరూ జర జాగ్రత్త పడాల్సిందే

**టి మీడియా, జనవరి 3, ఢిల్లీ ::**

కరోనా మహమ్మారికి మూల కేంద్రమైన చైనాలో మరో వైరస్ కలకలం రేపుతోంది. హ్యూమన్ మెటానిమోవైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు అక్కడి సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ వైరస్ బారినపడి అక్కడి ప్రజలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నట్లు తెలుస్తోంది.

**కరోనా కూడా!**

హెచ్ఎంపీవీతోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైకోప్లాస్మా, నిమోనియా, కొవిడ్-19 వైరస్‌లు కూడా చైనాలో వ్యాప్తి చెందుతున్నట్లు పలువురు పోస్టులు పెడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ ప్రకటించినట్లు పలువురు యూజర్లు పేర్కొంటున్నప్పటికీ, దీనిపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదు. ఈ వైరస్ సోకిన వారిలో కొవిడ్ తరహాల లక్షణాలే కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. వైరస్ వ్యాప్తిని అక్కడి ఆరోగ్యశాఖ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**ఔను నిజమే!**

చైనాకు చెందిన 'సీడీఎస్' వెబ్‌సైట్ ప్రకారం ఈ హ్యూమన్ మెటానిమోవైరస్ అనేది ఆర్?ఎన్?ఏ వైరస్. దీన్ని 2001లో తొలిసారి డచ్ పరిశోధకులు గుర్తించారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్న పిల్లల నమూనాలను అధ్యయనం చేయడం ద్వారా ఇది బయటపడింది. ఈ వైరస్ ప్రధానంగా దగ్గు, తుమ్ముల ద్వారా వచ్చే తుంపర్ల ద్వారా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు, కలుషితమైన వాతావరణాలకు గురికావడం వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది.ఈ వైరస్ పొదిగే కాలం మూడు నుంచి ఐదు రోజులు. ఎక్కువగా శీతాకాలం, వసంతకాలంలో ఎక్కువగా ఇది వెలుగు చూస్తుంది. ఈ హ్యూమన్ మెటానిమోవైరస్ చిన్నారులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులు, వృద్ధులపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాసలో గురక వంటి లక్షణాలు దీనికి ఉంటాయి. తీవ్రమైన సందర్భాల్లో, ఇది బ్రోన్కైటిస్, న్యుమోనియాకు కూడా దారితీయవచ్చు. ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. గుర్తు తెలియని ఓ నిమోనియా తరహా వైరస్ మూలాలను కనుగొనేందుకు చైనా వ్యాధి నియంత్రణ అథారిటీ ఓ పర్యవేక్షక వ్యవస్థను ప్రారంభించిందన్నది ఆ నివేదిక సారాంశం.

**జర జాగ్రత్త పడాల్సిందే!**

దాదాపు ఐదేళ్ల క్రితం కొవిడ్-19 వ్యాప్తి తొలినాళ్లలో సరైన నిరోధక చర్యలు చేపట్టకపోవడం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చైనా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే వైరస్ కారకాలను గుర్తించేందుకు, ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగానికి అవసరమైన సూచనలు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు అక్కడి అధికార మీడియా 'సీసీటీవీ' వెల్లడించింది. అంతేకాదు డిసెంబరు 16 నుంచి 22 వరకు, ఈ వారం రోజుల వ్యవధిలోనే అంటువ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది.

## గవర్నర్‌గా కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం

**టీ మీడియా, జనవరి 3,భువనేశ్వర్:**



ఒడిశా గవర్నర్ గా కంభంపాటి హరిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చక్రధారి శరణ్ సింగ్ ప్రమాణం చేయించారు. రాజధాని భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్, మాజీ సీఎం నవీన్ పట్నాయక్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కంభంపాటి హరిబాబు 2021 జులైలో తొలిసారి మిజోరం గవర్నర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్ రాజీనామాతో.. ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబును నియమిస్తూ గతేడాది డిసెంబర్‌లో కేంద్రం ప్రకటించింది.

# మరో 7 ఎయిర్ పోర్టులు

- కొత్త విమానాశ్రాయాలపై సీఎం సమీక్ష
- హాజరైన మంత్రి రామ్మోహన్ నాయుడు
- ఎయిర్‌పోర్టు అథారిటీ ఉన్నతాధికారులు



**టీ మీడియా, జనవరి 3, అమరావతి:**

రాష్ట్రంలో కొత్తగా మరో 7 విమానాశ్రయాలు రానున్నాయి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. విమానాశ్రాయాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెస్తే రాష్ట్రాభివృద్ధికి ఉపయోగకరంగా ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఎయిర్‌పోర్టుల విస్తరణ, నిర్మాణం, కొత్త విమానాశ్రాయాల కట్టడంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో పాటు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు.రాష్ట్రంలో ప్రస్తుతం 7 విమానాశ్రయాలు ఉన్నాయి. విశాఖ, తిరుపతి, కడప, రాజమండ్రి, గన్నవరం విమానాశ్రయాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. కర్నూల్ ఎయిర్‌పోర్టు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉండగా పుట్టపర్తిలో ప్రైవేటు ఎయిర్ స్ట్రిప్ ఉంది. వీటికితోడు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. అయితే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మరో 7 ఎయిర్ పోర్టులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కుప్పం, దగదర్తి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, తుని-అన్నవరం, ఒంగోలులో నూతన ఎయిర్‌పోర్టులను నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసింది.

**7 ప్రాంతాల్లో భూ సేకరణ పూర్తి:**

కుప్పం ఎయిర్‌పోర్ట్ ఫీజిబులిటీ రిపోర్ట్ సిద్ధం చేశారు. మొదటి దశలో 683 ఎకరాలు, రెండో దశలో 567 ఎకరాలు కలిపి మొత్తం 1,250 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించారు. అయితే ఈ ప్రాంతానికి సమీపంలో ఐఏఎఫ్?, హెచ్‌ఏఎల్, బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉన్నందున ఎయిర్‌స్పేస్ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. దీనికి సంబంధిత వర్గాల నుంచి ఎన్?వోసీ అవసరం ఉంటుంది. శ్రీకాకుళం ఎయిర్‌పోర్టు ఫీజిబులిటీ సర్వే పూర్తయింది. రెండు దశల్లో 1,383 ఎకరాల్లో నిర్మించేలా ప్లాన్ చేశారు. ఇప్పటికే భూసేకరణ మొదలైంది.

**ఇన్ఫోసిస్ సహకారంతో 'ఏపీ ల్యాబ్ ఆన్ వీల్స్**

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే దగదర్తి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయగా 635 ఎకరాల భూసేకరణ కూడా పూర్తయింది. మరో 745 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో బీపీసీఎం రిఫైనరీ వస్తోంది. మరికొన్ని ఫ్యాక్టరీల రాకతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని కార్గోకు, పరిశ్రమలకు ఉపయోగపడేలా ఎయిర్‌పోర్టు నిర్మించనున్నారు. శ్రీ సిటీ సెజ్‌లో ఎయిర్ స్ట్రిప్ తెచ్చే అంశాన్నీ పరిశీలించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.ఒంగోలు విమానాశ్రయం కోసం 657 ఎకరాలు గుర్తించగా ఫీజిబులిటీపై అధ్యయనం చేయాల్సి ఉంది. ల్నాడు జిల్లా పరిధిలో నాగార్జునసాగర్ వద్ద 1,670 ఎకరాల్లో నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా మరో 500 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ భూమికి అటవీశాఖ క్లియరెన్స్ అవసరముంది. 1,123 ఎకరాల్లో తాడేపల్లిగూడెం ఎయిర్‌పోర్టు కట్టాలని నిర్ణయించారు. అయితే దీని సమీపంలోనే రాజమండ్రి, గన్నవరం విమానాశ్రాయాలు ఉన్నందున ఫీజిబులిటీని పరిశీస్తున్నారు.తుని-అన్నవరం మధ్య 757 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు తేలవాలని ప్రతిపాదించారు. ఈ ప్రాంతంలో రైల్వే లైన్, హైవే, వాటర్ బాడీ ఉందని అధికారులు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమలు, నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ వస్తున్నందున అక్కడ ఎయిర్‌పోర్టు అవసరం ఉందని సీఎం అన్నారు. అనకాపల్లి, కాకినాడ, విశాఖలకు దగ్గరలో నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్దేశించారు. తాడిపత్రి ప్రాంతంలో ఒక ఎయిర్‌పోర్టుకు అవకాశం ఉందని దాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. అసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టాలి: గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. కూచిపూడి నృత్యం, అమరావతి స్థూపాల థీమ్‌తో టెర్మినల్ కొత్త డిజైన్లు సిద్ధం చేశారు. జూన్ నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతిని అధికారులు వివరించారు. ఏవియేషన్ యూనివర్సిటీ, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఎయిర్‌పోర్టుల్లో ప్రైవేటు విమానాల పార్కింగ్ అవసరాలు పెరుగుతాయని ఆయా అసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచనలు చేశారు.

## కొత్త రేషన్‌కార్డుల కోసం వారంలో కీలక ప్రకటన

- మార్గదర్శకాల్లో మార్పు చేర్పులు

**టి మీడియా, జనవరి 3, హైదరాబాద్ బ్యూరో :**

అర్హులైన పేదలకు కొత్తగా రేషన్ కార్డులు అందించేందుకు సంక్రాంతి నుంచి దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. దీనికోసం ఆదాయ పరిమితి, ఇతర అర్హతలపై అధికారులు దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల్లో ఆదాయ పరిమితిని పరిశీలించారు. గతంలో ఉన్న మార్గదర్శకాల్లో మార్పు చేర్పులు చేయనున్నట్లు సమాచారం. ఆదాయ పరిమితి కొంత పెంచాలని అధికారులు ప్రతిపాదించనున్నట్లు తెలిసింది.వారంలోపే కీలక నిర్ణయం : కొత్త రేషన్ కార్డుల కోసం హైదరాబాద్ నగరవాసుల ఎదురుచూపులకు త్వరలోనే తెరపడనుంది. సంక్రాంతి తరువాత ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు స్పష్టత ఇవ్వడంతో ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. నగరం నుంచి కొత్తగా దాదాపు లక్ష దరఖాస్తులు వస్తాయని అధికార వర్గాల అంచనా. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లా పరిధిలో 6,39,506 రేషన్ కార్డులు ఉండగా, 15 నుంచి 20 శాతం పెరుగుదల ఉంటుందని పౌర సరఫరాల శాఖ అధికారులు అనుకుంటున్నారు. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ పరిధిలో



ప్రస్తుతం 653 చౌక ధరల దుకాణాలు ఉండగా, వీటిలో 66 డీలర్ల స్థానాలు ఖాళీగా ఉండగా, ప్రస్తుతం 587 చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరఫరా అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అర్హతలను నిర్దేశించి అవకాశం కల్పించినప్పుడు కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈ విషయమై కొత్త రేషన్ కార్డులకు సంబంధించి వారంలోపే కీలక నిర్ణయం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.ఫిబ్రవరి నుంచి సన్న బియ్యం పంపిణీ! : తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ప్రతి లబ్ధిదారుడికి ప్రస్తుతం 6 కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారు. వీటి స్థానంలో సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్కెట్లో అధిక ధర పలుకుతున్న నేపథ్యంలో ఉచితంగా అందించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో సన్న ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి, తిరిగి నిరుపేదలకే పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో ఈ కొత్త పథకాన్ని తీసుకొస్తున్నట్లు సమాచారం. శనివారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు 'పేదలకు సన్నబియ్యం పంపిణీ' అంశం చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

# అధికారుల కోసం కార్మికులు పడిగాపులు

- బిల్లుల కోసం తిరుగుతున్న కార్మికులు
- రెన్యూవల్ కానీ లేబర్ కార్డులు
- అధికారిని నియమించాలని కోరుతున్న కార్మికులు

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కొనసాగుతున్న లేబర్ కార్మిక శాఖ కార్యాలయంలో రెగ్యులర్ అధికారి లేక ఇన్చార్జి తో నెట్టుకొస్తున్న కార్మిక శాఖ.అధికారుల కోసం కార్మికులు పడిగాపులు,
బిల్లుల కోసం తిరుగుతున్న కార్మికులు, రెన్యూవల్ కానీ లేబర్ కార్డులు రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరుతున్న కార్మికులు.గతంలో ఇక్కడ సహాయ కార్మిక శాఖ అధికారిగా పని చేసిన వేణుగోపాల్ గద్వాల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంకా వనపర్తి జిల్లాకు ఎవరు రాకపోవడంతో వేణుగోపాల్ ను ఇన్చార్జిగా నియమించారు. వారంలో ఒకరోజు మాత్రమే అతడు వనపర్తి కార్మిక శాఖ కార్యాలయానికి వస్తుండడంతో వందల సంఖ్యలో ఒకేసారి కార్మికుల పాల్గొనడంతో పనులు సరిగ్గా కావడం లేదు. అధికారులు ఎప్పుడూ ఉంటారో తెలియక కార్మికులు రోజు ఆఫీస్ చుట్టూ తిరిగి పోతున్నారు. శుక్రవారం వస్తాడని తెలియడంతో కార్మికులందరూ ఆఫీసుకి వస్తే మధ్యాహ్నం రెండు అయినా ఇంతవరకు అధికారి ఆఫీసుకు రాకపోవడంతో కార్మికుల తిండి తిప్పలు మాని ఆఫీస్ ముందే కూర్చున్నారు. జిల్లాలో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు వారి యొక్క




లేబర్ కార్డులు రెన్యువల్, డెత్ , డెలివర్ , మ్యారేజ్ బెనిఫిట్ సంవత్సరాలు తరబడి రాక పోవడంతో డబ్బులు కొరకు కార్యాలయం చుట్టూ తిరుగుతున్న కార్మికులకు తెలియ జేయడానికి కార్యాలయంలో అటెండర్ తప్ప ఎవరు కనిపించడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న సహాయ కార్మిక శాఖ అధికారి గద్వాలకు బదిలీ, జూనియర్ అసిస్టెంట్ ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో, కంప్యూటర్ ఆపరేటర్ గద్వాలకు వెళ్లారు. దీంతో కార్యాలయం ప్రతిరోజు ఖాళీగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి రెగ్యులర్ అధికారిని నియమించాలని భవన నిర్మాణ కార్మికుల కోరుతున్నారు. పని బంద్ చేసి దూర ప్రాంతాల నుంచి వచ్చి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న పనులు కాకపోవడంతో కార్మికులు తిరిగి నిరుత్సాహంతో వెళ్తున్నారు.

# ఏపీఎండీసీ కాపాడుకుంటాం

- కార్మిక సంఘాలు,కార్మికులు
- ఐదు డిమాండ్స్ తో సమ్మె సైరన్

**టీ మీడియా, జనవరి 3,మంగంపేట:**
ఏపీఎండీసీ సంస్థ మంగంపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో ఐదు డిమాండ్స్ పరిష్కరించాలని అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద దశలవారీ ఆందోళనలో భాగంగా భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జితో నినాదాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ఏపీఎండీసి యాజమాన్యం వారు గ్రేడ్ టెండర్ పిలవడం జరిగినది అయితే ఈ టెండర్ సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడేలా ఉన్నది అది ఎలా అంటే ప్రస్తుతం సి %డ%డి గ్రేడ్ ఒక టన్నుకు 1680 రూపాయలు ఉంటే ఏపీఎండీసీ యాజమాన్యం మాత్రం 60 లక్షల టన్నుల సి %డ%డి గ్రేడ్ టెండర్ పిలిచిన దానిలోఒక టన్నుకు కేవలం 1188 రూపాయలు పెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని కార్మిక సంఘాలు ప్రశ్నించారు,దీనివలన సంస్థ మనుగడకు ప్రమాదం ఏర్పడి దీనిని నమ్ముకుని జీవిస్తున్న సుమారు 700 మంది కార్మికుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని వెంటనే సి%డ%డి గ్రేడ్ టెండర్ ను ఆపాలని వారు డిమాండ్ చేశారు, సంస్థను నమ్ముకుని సంస్థకు ఇండ్లను, భూములను ఇచ్చి అవుట్ సోర్సింగ్ కార్మికులుగా %డ%ట్రైనీ కార్మికులుగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల పరిస్థితి ఏంటో యాజమాన్యం వారు చెప్పాలి, ఆనాడు గ్రామ కమిటీ తో చేసుకున్న ఒప్పందం ప్రకారం యాజమాన్యం వీరందరిని పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు, అలాగే పర్మినెంట్ వారికి ప్రమోషన్స్,రివైస్డ్ పేస్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, అలాగే ఈ సంస్థ ఆధ్వర్యంలో బెనిఫిషికేషన్ ప్లాంట్ ఏర్పాటు చేసి సంస్థను లాభాల బాటలో 15 సంవత్సరాలు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు, ఏపీఎండీసీ యాజమాన్యం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు ఆదాయం గడించారు ఆ లాభాల సొమ్ము ను ఎం చేసారో చెప్పకుండా ఐదు వేల కోట్ల రూపాయలకు సంస్థ ఆస్తులను అమ్మాలని చూడడం చాలా దారుణం వెంటనే ఆ చర్యలను విరమించాలని డిమాండ్ చేశారు యాజమాన్యం 15 వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించకుంటే 16 వ తేదిన నిరవధిక సమ్మెలోకి వెళ్తామని వారు యాజమాన్యం వారికి తెలిపారు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జితో నిరసన ధర్నానిర్వహించారు ఈ ధర్నా కు భారీ స్థాయిలో కార్మికులు కార్మిక సంఘాలు హాజరయ్యారు ఈ కార్యక్రమం లో అన్ని యూనియన్స్ నాయకులు పాల్గొన్నారు.



## సావిత్రి బాయ్ పూలే జయంతి

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయ్ పూలే జయంతి సందర్భంగా వనపర్తి జిల్లాలో తరుణీ హాల్ లో బహుజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఏఈ నీలా బాయి , వరలక్ష్మి బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, బీఎస్ఎఫ్ నాయకులు తోల రాము, బీసీ సంఘ నాయకులు అరవింద్ వారు మాట్లాడుతూ సావిత్రి బాయ్ పూలే అణగారిన వర్గాల హక్కుల కోసం జ్యోతి రావు పూలే తో కలిసి ఎంతోమందికి విద్యను అందించిన మహనీయులు. మన దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేసి నేటికీ ఎంతో మంది మహిళలకు ఆదర్శనీయం వారి జీవితం.పూలే ఇద్దరు దంపతులు సమాజంలో విద్య యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ ఏన్నో పాఠశాలను ప్రారంభించి ప్రతిఒక్కరికీ అక్షర జ్ఞానం చేసారు. అలాంటి మహానియురాలిని వారి జయంతి సందర్భంగా స్మరించుకోవడం చాలా గర్వంగా ఉందని అన్నారు.




## సమగ్ర శిక్ష ఉద్యోగులకు అండగా ఉంటాం

- కిషన్ రెడ్డితోజిల్లెల చిన్నారెడ్డి , ఉద్యోగుల ప్రతినిధుల భేటీ

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
సమగ్ర శిక్ష ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేంద్ర ఉక్కు, గనుల శాఖల మంత్రి జి. కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం దిల్ కుశ అతిథి గృహంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి , సమగ్ర శిక్ష ప్రతినిధులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.సమగ్ర శిక్ష కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 60 % శాతం నిధులను ఇస్తుండగా మిగిలిన 40% నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి , వర్కింగ్ ప్రెసిడెంట్ వీ. అనిల్ చారీ ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.రాష్ట్రంలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారని, కానీ చాలీ చాలని వేతనాలతో సతమతమవుతున్నామని వారు పేర్కొన్నారు.
సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 60 శాతం నిధుల వాటాను కొనసాగించాలని ఉద్యోగులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు.



## యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

- తండ్రి వర్ధంతి సందర్భంగా రక్తదానం చేసిన కూతుర్లు

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన సొనాయిల శ్రీనివాసులు వర్ధంతి సందర్భంగా తన కూతుళ్లు యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా టౌన్ ఎస్ఐ ముఖ్యఅతిథిగా టౌన్ ఎస్సై హరిప్రసాద్ , ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్ ఇద్దరు కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్సై సురేందర్ మాట్లాడుతూ రక్తదానం మహాదానం. ప్రతిరోజు ఎంతోమంది గర్భిణి స్త్రీలు, తల సేమియా, దయాలసిస్,క్యాన్సర్ రకరకాల కారణాల వల్ల బ్లడ్ దొరకక చాలా అవస్థలు పడుతున్నారు. యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు రక్తదానం చేయడం చాలా గొప్ప విషయమని తెలిపారు.మనిషిగా పుట్టడం గొప్పకాదు సాటి మనిషి ప్రాణాలలో కాపాడాలని అందుచేత ఆరోగ్యవంతమైన యువతి యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్,యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొబ్బూరు నవీన్,జిల్లా ఆర్ఎంఓ, శోభారాణి ఉమారాణి కుటుంబ సభ్యులు , ల్యాబ్ టెక్నీషియన్స్ రమేష్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





## జూపల్లి కృష్ణారావును కలిసిన బిసి సంఘం

**టి మీడియా, డిసెంబర్ 3, మక్తల్:**
మక్తల్ మార్కెట్ నూతన పాలకవర్గ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంఘం తెలంగాణ రాష్ట్రం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసరి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సంఘం తరపున మంత్రి ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఎస్సీలను ఏ బి సి డి ల వర్గీకరణ వీలైనంత తొందరలో జరిపించాల్సిందిగా ఈ సందర్భంగా వారు మంత్రి గారిని కోరారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప గారు, ఉమ్మడి మాగనూరు మండల సంఘ కన్వీనర్ మహమ్మద్ నజీర్, మహమ్మద్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు క్రిష్ణ మనోహర్ గౌడ్

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణా చౌరస్తా లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194 వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం క్రిష్ణ మనోహర్ గౌడ్ మాట్లాడుతూ గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడాన్ని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆహ్వానిస్తుందనీ హర్ష వ్యక్తం చేశారు. భారతదేశ మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, సమాజం కోసం ఎన్నో రకాల ఒడిదొడుకులు ఎదుర్కొంటూ మహిళలలో చైతన్యం కలిగించి ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపిన సంఘసంస్కర్త భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ,వారిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని వారి జీవిత చరిత్ర, తెలుసుకోవలసిన అవసరం ఉందని గుర్తు చేశారు, సావిత్రిబాయి పూలే. అట్టడుగు వర్గాల, మహిళల హక్కులు నిరాకరించబడిన దేశంలో ఆనాటి కట్టుబాట్లను, సాంప్రదాయాలను, ఆధిపత్య వర్గాలను దిక్కరించిన భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలు, విద్య ద్వారానే స్త్రీ జాతి విముక్తి సాధ్యమని బలీయంగా నమ్మి దేశంలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిందనీ. పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడి, కుల వ్యవస్థ పునాదులను పెకలించి, మహిళల సకల హక్కుల కోసం పోరాడటం సామాజిక బాధ్యతగా స్వీకరించిన ధీశాలి అని క్రిష్ణ మనోహర్ గౌడ్ తెలిపారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలనే ఏర్పాటు చేయాలని సందర్భంగా కోరారు. ఈ కార్యక్రంలో బిసి సంగాల నాయకులు, విద్యార్థి జెఏసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కస్తూర్బా గాంధీ ఉద్యోగులను చర్చలకు పిలువాలి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

**టీ మీడియా, జనవరి 3,సంగారెడ్డి :**
రాజకీయ స్వార్థం కోసమే జమిలి ఎన్నికల కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులువిమర్శించారు. సంగారెడ్డి సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల్లో ప్రయోజనం కోసమే ఒకే దేశం, ఒకే ఎన్నికని బీజేపీ కుట్రలు పన్నుతున్నది. పార్లమెంట్లో జమిలి బిల్లు పాస్ కాదని విషయం తెలిసినా హైలెట్ కావడం కోసమే బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో మంత్రులు కస్తూర్బా ఉద్యోగుల సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పంజాబ్లో గత 39 రోజులుగా రైతులు ఉద్యమం చేస్తున్నారు. దలేవాల్ అనే రైతు నాయకుడు హాస్పిటల్లో నిరాహార దీక్ష చేస్తున్నారు . అయినా కేంద్ర ప్రభుత్వం రైతుల ఆందోళనలపై స్పందించకపోవడం దారుణమన్నారు.




కస్తూర్బా గాంధీ ఉద్యోగులు గత 25 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వారి డిమాండ్లపై దృష్టి సారించాలి. ఉద్యోగులను చర్చలకి పిలిచి ప్రభుత్వం మాట్లాడాలని సూచించారు.

## సావిత్రి భాయి పూలేజయంతి వేడుకలు

**టీ మీడియా ,డిసెంబర్ 3 ,ఆత్మకూర్:**
అమరచింత పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చదువుల తల్లి సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం కార్యక్రమంలో ఉద్దేశించి మాట్లాడుతూ భారత మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే మహిళల విద్యాభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. ఈ రోజు మహిళలు ఉన్నత స్థాయి లో నిలవడానికి సావిత్రిబాయి పూలే కారణమని అన్నారు.ఆనాడు మహిళలకు విద్య నిషేధం ఉన్నప్పటికీ మహిళలకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి అనేక ఇబ్బందులు ఎదుర్కొని మహిళలకు విద్య నేర్పి వారి జీవితాల్లో వెలుగు నింపి నేడు మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానం సాధించడంలో ఈమె ప్రధాన పాత్ర కలిగి ఉందని అన్నారు. విద్య పట్ల ఈమె సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కల నరసింహులు గౌడ్ విశ్రాంత ఉపాధ్యాయుడు జె.ఎల్. విక్టర్, అంబేద్కర్ జాతర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, కిన్నెర అర్జున్ కుమార్, టైలర్ రామ్మూర్తి, దేవరాజ్ ఫోటోగ్రాఫర్, కె . పెద్ద బాలరాజ్,ఎస్.శ్యామ్ సుమన్, పట్నం సూరి,బి.శేఖర్ ,నబి, సోనీ అక్బర్, ధర్మపురం టైలర్ కురుమన్న, విద్యావేత్తలు పుర ప్రముఖులు పాల్గొన్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం..

- కారు, ఆటో ఢీ ముగ్గురు దుర్మరణం

**టి మీడియా, జనవరి 3,మెదక్ :**
మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదచోటు చేసుకుంది. కారు, ఆటో ఢీ కొనడంతో ముగ్గురు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన నర్సాపూర్ పట్టణ సమీపంలోని మెదలమ్మ గుడి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..సంగారెడ్డి జిల్లా నర్సాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు ఆటోలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## నందీశ్వర ఉడిపి హొటల్ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణం రాజీవ్ గాంధీ చౌరస్తా దగ్గర ఆంధ్ర బ్యాంకు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన నందీశ్వర ఉడిపి హొటల్ ను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుక్రవారం ప్రారంభించారు.దిన దిన అభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణానికి ఇలాంటి హొటల్లు అవసరమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలో 1వ వార్డులో బోయిని బాలకృష్ణ( చంటి) గురువారం రోజున మరణించడం జరిగింది. ఎమ్మెల్యే మేఘారెడ్డి బాలకృష్ణ( చంటి ) మరణ వార్త తెలిసిన వెంటనే వారి నివాసం దగ్గరికి వెళ్లి బాలకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇవ్వడం జరిగింది మున్సిపల్ చైర్మన్, వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త, వనపర్తి పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**టీ మీడియా ,డిసెంబర్ 3 ,మక్తల్**
మక్తల్ వ్యవసాయ మార్కెట్ నెహ్రూ గంజ్ కమిటీ చైర్మన్ గా గవినోళ్ళ రాధ లక్ష్మారెడ్డి , వైస్ చైర్మన్ గా గణేష్ , డైరెక్టర్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మరిచిపోదని, వారికి తగిన గౌరవం వస్తుందని ఎవరు అధైర్య పడరాదని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి , దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి , దేవరకద్ర నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు సీత దయాకర్ రెడ్డి , నారాయణపేట నియోజకవర్గ ఇన్చార్జి కుంభం శివకుమార్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ రెడ్డి మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## టిఎస్ యుటిఎఫ్ డైరీ క్యాలెండర్స్ ఆవిష్కరణ

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2025 సంవత్సరపు డైరీ, క్యాలెండర్ ను వనపర్తి డిఇఓ అబ్దుల్ గని ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవనంలో జరిగిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా అభివృద్ధి,సామాజిక అభివృద్ధి కోసం పని చేయాలని కోరారు. విద్యార్థులలో నాణ్యమైన విద్యనందించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. 10వ తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు మంచి గ్రేడులు సాధించే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధ్యయనం, ఆధ్యాపనం సామాజిక లక్ష్యాలతో పనిచేస్తున్న టిఎస్ యుటిఎఫ్ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. రవి ప్రసాద్ గౌడ్, డి. కృష్ణయ్య, సెక్టోరియల్ అధికారి శేఖర్, ఏఎంఓ మహానంది, గోపాల్పేట ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, పానుగల్ ఎంఈఓ బి. శ్రీనివాసులు, శ్రీరంగాపూర్ ఎంఈఓ హనుమంతు, టీఎస్ యుటిఎఫ్ నాయకులు కే జ్యోతి,బి. వెంకటేష్ పి. శ్రీనివాస్ గౌడ్ , ఎండి హమీద్ చిరంజీవి, తిమ్మప్ప,ఎ.వెంకటేష్ అరుణ ,అశ్విని , జి.మురళి రాముడు, అయోధ్య రాముడు, సూరయ్య,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.




## క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**టీ మీడియా, డిసెంబర్ 3, దేవరకద్ర:**
దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం డోకూర్ గ్రామంలో ప్రేమ్ కుమార్, సంపత్ కుమార్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టౌర్నమెంట్ ప్రారంభోత్సవం లో పాల్గొని టౌర్నమెంట్ ను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని తెలిపారు, క్రీడాకారులు గెలుపు, ఓటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలని కోరారు.



## అయ్యప్ప మహా పడిపూజ మహొత్సవం

**టీ మీడియా, డిసెంబర్ 3 ,ఆత్మకూర్**
అమరచింత పట్టణంలో శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నుండి మాల ధరించిన అయ్యప్ప స్వాములు కలశం అయ్యప్ప స్వామి పల్లకి సేవ ఊరేగింపు శోభయాత్ర కన్నుల పండుగల సాగుతోంది. పురవీధులో పల్లకిసేవ ఊరేగింపులో స్థానిక గాంధీ చౌక్ వద్ద కేరళ వాయిద్యంతో తేటతిల్లు ఆడిన.. టి పి సి సి రాష్ట్ర అధికార ప్రతినిధి, కల్లు గీత సెల్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, మదనాపురం గోపాలకృష్ణ గురుస్వామి,కమలాకర్ గౌడ్ గురుస్వామి, రమేష్ స్వామి, %వీ% రాజు, తదితర గురు స్వాములు అయ్యప్ప స్వాములు పుర ప్రముఖులు మహిళలు పాల్గొన్నారు.



# దొబ్బేసిన చోటే దొరికిపోయాడు

- ఆరేళ్లుగా అడ్రస్ లేని ఘరానా దొంగ



**టీ మీడియా, జనవరి 3, నారాయణపేట:**

ఎక్కడ తప్పించుకున్నాడో.. మళ్ళీ అక్కడే దొరికాడు. గతంలో వరుస చోరీలు చేసి పోలీసులకు పట్టుబడి జైలుకెళ్ళాడు. అక్కడ నుంచి తప్పించుకుని ఆరేళ్లుగా అడ్రస్ లేకుండా తిరుగుతున్నాడు. ఎక్కడెక్కడో తిరిగి మళ్ళీ అదే ప్రాంతంలో చోరీకి ప్రయత్నం చేసి ఖాకీల చేతికి చిక్కాడు. నారాయణపేట జిల్లాలోనే ఆసక్తి రేపుతోంది ఓ ఘరానా దొంగ ఉదంతం.బంగారు నగలు, పట్టగొలుసులు, ఉంగరాలు నగల దుకాణాల్లో ఉండాల్సి వస్తువులన్నీ పోలీస్ స్టేషన్‌లో ప్రదర్శించారు. ఇది ఒక దొంగ తో దోచుకున్న ప్రజల సొత్తు. అదే పనిగా దొంగతనాలకు అలవాటుపడి చిక్కడు-దొరకడు అన్నట్టు నారాయణపేట జిల్లాలో పోలీసులకు సవాల్ విసిరి చివరకు కటకటాల పాలయ్యాడు ఓ ఘరానా దొంగ. వరుస చోరీలతో కంటిమీద కునుకు లేకుండా చేసిన చాపలి భాస్కర్ ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

ఊట్కూరు మండల కేంద్రానికి చెందిన చాపల భాస్కర్ చోరీ ప్రస్థానం ఇప్పటిది కాదు. 2016 నుంచి మక్తల్, ఊట్కూరు, మద్దూరు తదితర ప్రాంతాల్లో చోరీలు చేసి పట్టుబడి జైలుకు సైతం వెళ్ళాడు. ఈ క్రమంలోనే 2018 ఆగస్టు 10వ తేదీన జైలులోనే గొంతు కోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం పోలీస్ ఎస్కార్ట్ తో మహబూబ్‌నగర్ జనరల్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడి నుంచి పోలీసుల కళ్ళు గప్పి పారిపోయాడు.ఆ తర్వాత కొంతకాలం బెంగళూరులో ఉండి తిరిగి హైదరాబాద్ కు వచ్చి కాటేదాన్ ఏరియాలో కొంతకాలం కూలీ పని చేశాడు. అయితే చోరీలకు అలవాటు పడ్డ భాస్కర్ కు కూలీ పని డబ్బులు సరిపోలేదు. దీంతో మళ్లీ చోరీలకు స్కెచ్‌లు వేశాడు. ఎక్కడైతే గతంలో పోలీసులకు చిక్కాడో, మళ్ళీ అక్కడి నుంచి దొంగతనాలను పునః ప్రారంభించాడు. నారాయణపేట, మరికల్, మక్తల్, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్, బొమ్రాస్పేట్, పరిగి ఏరియాలలో దొంగతనాలకు పాల్పడ్డాడు. పోలీసులకు చిక్కకుండా వరుస చోరీలతో సవాల్ విసిరాడు. ఇదే క్రమంలో తాజాగా మరికల్‌లో దొంగతనం చేయడానికి రాగా పోలీసులకు చిక్కాడు. నిందితుడి వద్ద నుండి రూ. 19.40 లక్షల రూపాయల విలువైన 248 గ్రాముల బంగారం, దాదాపు రూ. 1.50 లక్షల విలువైన వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేయడానికి ఉపయోగించే ఒక ఐరన్ రాడ్ అతని బ్యాగును సీజ్ చేశారు. వరుస చోరీలతో కంటిమీద కునుకు లేకుండా చేసిన ఘరానా దొంగ చాపలి భాస్కర్ చిక్కడంతో ఇటు నారాయణపేట, అటు పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.



## అల్లు అర్జున్‌కు రెగ్యులర్ బెయిల్

- మంజూరు చేసిన నాంపల్లి కోర్టు

**టి మీడియా, జనవరి 3, హైదరాబాద్ బ్యూరో :**

నటుడు అల్లు అర్జున్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు విచారణ చేపట్టి రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. ఇప్పటికే ఇరువైపులా వాదనలు ముగియగా నాంపల్లి కోర్టు తీర్పును నేటికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన మధ్యంతర బెయిల్?పై ఉన్నారు. ఈ నెల 4న పుష్ప బెనిఫిట్ షో రోజు సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, ఈ నెల 27న రిమాండ్ ముగిసింది. అదే రోజు ఆయన వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అప్పుడే ఆయన తరఫు లాయర్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ విచారణ వాయిదా పడగా, సోమవారం నాంపల్లి కోర్టు విచారణ చేపట్టింది.

# గర్భసంచి తొలగించుకుంటున్న మహిళలు

- నిరక్షరాస్యులు, గ్రామీణులే అత్యధికం!



**టి మీడియా, జనవరి 3, ఢిల్లీ :**

దేశంలోని ప్రతి 100 మంది మహిళల్లో దాదాపు 5% మంది గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్రచికిత్సలు చేయించుకున్నారని ఓ నివేదిక వెల్లడించింది. 2015-16 మధ్య జాతీయ కుటుంబ సర్వేలో 4.5 లక్షల మంది గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించి దీనిని రూపొందించారు. ముంబయిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్, జాతీయ ఆరోగ్య-కుటుంబ సంక్షేమ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొన్నారు. ఈ నివేదిక వివరాలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్‌లో ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం, మన దేశంలో 25-49 ఏళ్ల మధ్య వయస్సున్న ప్రతి 100 మంది మహిళల్లో ఐదుగురు గర్భసంచిని తొలగించుకున్నారు. వీరిలో వ్యవసాయ పనుల్లో పాల్గొంటున్నవారి సంఖ్య అత్యధికంగా 32 శాతంగా ఉంది. ఈ రంగంలో ఉన్న ఉపాధి అభద్రతే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. నెలసరి సమస్యలు, దాని చుట్టూ ఉన్న అపనమ్మకాలు, ఆరోగ్యంపై అశ్రద్ధ మొదలైనవి గర్భసంచి తొలగింపునకు దారి తీస్తున్నాయి. దీనితోపాటు నెలసరి నొప్పులను భరించలేక, క్యాన్సర్ వస్తుందేమో అన్న భయాలతో కొందరు హిస్టరెక్టమీ చేయించుకుంటున్నారు. మరికొందరు పిల్లలను కనేసిన తర్వాత గర్భసంచిని నిరుపయోగ అవయవంగా భావించి, దానిని తొలగించుకుంటున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**3రాష్ట్రాల్లోనే ఎక్కువగా!**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బిహార్ రాష్ట్రాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోందని నివేదిక పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో అవసరం లేకపోయినా గర్భసంచి తొలగింపు శస్త్రచికిత్సలు చేస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని తెలిపింది. బిహార్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడానికి కుటుంబ ఆదాయం తక్కువగా ఉండటం కారణమైతే, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆరోగ్య బీమా పరిధి ఎక్కువగా ఉండటం ఒక కారణంగా తెలుస్తోంది. అటు గ్రామీణులు, నిరక్షరాస్యులు, ఉన్నత వర్గాల మహిళలు కూడా హిస్టరెక్టమీ చేయించుకోవడానికి మొగ్గుచూపుతున్నారని ఆ నివేదిక పేర్కొంది. వాస్తవానికి దేశంలో జరుగుతున్న మొత్తం హిస్టరెక్టమీ శస్త్రచికిత్సల్లో రెండో వంతు ప్రైవేటు ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయని, వీటి పెరుగుదల వెనుక ఆసుపత్రుల లాభాపేక్ష కూడా ఒక కారణమై ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.



## పాఠశాలకు కంప్యూటర్ వితరణ

**టీ మీడియా, జనవరి 3, వనపర్తి బ్యూరో :**

వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల హై స్కూల్ నందు పేద విద్యార్థులు కంప్యూటర్ ద్వారా విద్యను నేర్చుకొనుటకు ఆ పాఠశాల ఉపాధ్యాయుల కోరిక మేరకు టిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రేమ్ నాథ్ రెడ్డిని అడుగగా ఇట్టి విషయాన్ని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రోద్బలంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పాఠశాలకు ఐదు కంప్యూటర్ సిస్టంలు ఇవ్వడం జరిగినది . ఈ కంప్యూటర్ సిస్టం లో పాఠశాల ఉపాధ్యాయులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రేమ్ నాథ్ రెడ్డి తో పాటు పలస రమేష్ గౌడ్ , గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, గంధం పరంజ్యోతి, కంచె రవి, ఇమ్రాన్, సూర్యవంశం గిరి, ఏకే పాషా, ముని కుమార్, అఖిలేంధర్, ముద్దు సార్, పాఠశాల ఉపాధ్యాయులు కవిరాజు, ఉపాధ్యాయునీయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

- ఉపాధ్యాయులను సత్కరించిన మంత్రి పొన్నం

**టీ మీడియా, జనవరి 3,హుస్నాబాద్:**



మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా ప్రకటించిందన్నారు. మహిళలు సమర్థవంతులైతే ఆ కుటుంబం అన్ని విధాలుగా ఎదుగుతుందన్నారు. మహిళలు చదువుకోవడం నేరం అనే రోజులలో సావిత్రిబాయి పూలే విద్యనందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళా రీపాధ్యాయులకు ప్రోత్సాహకం కల్పిస్తుందన్నారు. మహిళా రీపాధ్యాయులు సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకొని విద్యాబోధన కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ ఛైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ ఛైర్మన్ తిరుపతిరెడ్డి, ఆర్డీవో రాంమూర్తి, తహశీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో మనీల, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



## పులేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, జనవరి 3,వనపర్తి బ్యూరో :**

జనవరి 3న సావిత్రి బాయి పులే జన్మ దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వనపర్తి పట్టణంలోని ఐ.డి.ఒ.సి సమావేశ మందిరంలో సావిత్రి బాయి పులే 194వ జయంతి వేడుకలను మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలుగా ఘనంగా జరుపుకున్నారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా కలెక్టరు తో పాటు స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి , జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంట్లో ఒక మహిళా విద్యావంతురాలు ఉంటే కుటుంబం మొత్తాన్ని విద్యావంతులుగా తీర్చిదిద్దుతారని కితాబు ఇచ్చారు. వులో చెరగని ముద్ర వేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి మహిళా ఉద్యోగుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3న సావిత్రి బాయి పులే జన్మ దినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది అన్నారు. . మరో 6 వేల ఉపాధ్యాయ పోస్టులకు త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందన్నారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాభ్యాసం చేయించి నైపుణ్య శిక్షణ సైతం పూర్తి చేయించి ఉద్యోగ నియామకం చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుందన్నారు. జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు అయ్యిందని, జిల్లాలోని విద్యార్థులు బాగా చదువుకొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ ఎవరైనా చరిత్ర పుటల్లో ఎక్కాలంటే ఆషామాషీ కాదని ఎన్నో త్యాగాలు చేస్తే తప్ప చరిత్రలో నిలువరన్నారు.అంతకు ముందు బాల భవన్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతి మండలం నుంచి ఒకరి చొప్పున 15 మంది మహిళా ఉపాధ్యాయులకు జిల్లా కలక్టర్, శాసన సభ్యులు సన్మానం చేసారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, జిల్లా విద్యా శాఖ అధికారి మొహమ్మద్ అబ్దుల్ ఘని, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ సుజాత, దిశ కమిటీ సభ్యులు శంకర్ నాయక్, కౌన్సిలర్లు యం. ఈ ఓ లు, ఉపాద్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మోసగించడంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందే

- మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్

**టీ మీడియా, జనవరి 3,వనపర్తి బ్యూరో :**





బిజెపి వనపర్తి జిల్లా సంస్థాగత ఎన్నికల కార్యశాల-2025 బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ అధ్యక్షతన శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు,మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఏ ఇతర రాజకీయ పార్టీకి సాధ్యం కాని విధంగా ఉత్తరప్రదేశ్ మధ్యప్రదేశ్ హర్యానా గోవా ఈశాన్య భారతంలో బీజేపీ ముఖ్యమంత్రులు 25 యేళ్ళ,20 యేళ్ళ,15,10 యేళ్ళ నిర్విరామంగా పాలన కొనసాగిస్తున్నారంటే బిజెపి పార్టీ బూత్ కమిటీ మండల జిల్లా రాష్ట్ర జాతీయ కమిటీ ల అనుసంధానంతో సాధ్యమైందని 140 ఏళ్ల చరిత్రగల కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలకు ఈ అవకాశం దక్కపోవడానికి కారణం కేవలం కార్యకర్తల అనుసంధానమే కారణమని పేర్కొన్నారు.స్వతంత్ర స్వతంత్ర భారతావనిలో మునుపెన్నడూ లేని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలో అత్యుత్తమైన విదేశీ దౌత్య విధానం పట్ల ప్రపంచంలోని ముస్లిం, క్రైస్తవ యూరోప్ యూనియన్ లాంటి దేశాలు భారత్లో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నారని, ఐక్యరాజ్యసమితి ఆమోదం మేరకు ప్రపంచ దేశాలలో జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం జరుపు కుంటున్నామంటే అది కేవలం బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ ఘనత అని కొనియాడారు.తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కమిటీలు కేసులు విచారణ పేరిట కాలయాపన తప్ప ఆరు గ్యారెంటీల మాటున ఇచ్చిన 420 హామీలు అమలు కాక రాష్ట్ర ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై తీసుకున్న చర్యలు మూడు అడుగుల ముందుకు ఏడు అడుగులు వెనక్కి చందాన జరుగుతున్నదని రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చూస్తుంటే పదేళ్ల బిఆర్ఎస్ సంవత్సర కాంగ్రెస్ పాలన దొందు దొందే అన్న చందాన ఉన్నాయని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన పూర్తి స్థాయి మంత్రివర్గం నియమించని అసమర్థ దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని చేతులు మాత్రం గడపలు దాటట్లేదని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన జ్ఞానానికి బొమ్మ బొరుసు లాగా దొందూదొందు ఒకటే రకం అని రాబోయే స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని మట్టి కల్పించే విధంగా భారతీయ జనతా పార్టీ విజయం సాధించబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత బిజెపి జిల్లా రిటర్నింగ్ అధికారి రాజేందర్రెడ్డి, జిల్లా అధ్యక్షులు డి నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబి రెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి , ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి శ్రీశైలం , జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రామన్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు చిత్తారి ప్రభాకర్ , యువమోర్చా కదిరే మధు, జిల్లా నాయకులు వెంకటేశ్వర రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దిరాజు, బోయల రాము, మనివర్ధన్, ముప్పూరి చెన్నయ్య, అశ్విని రాధ, రాజశేఖర్ గౌడ్ , ఎండి ఖలీల్, రవి నాయక్, మండల అధ్యక్షులు బచ్చు రాము, సంద వెంకటేష్, కావలి తిరుపతయ్య, బుచ్చిబాబు గౌడ్, తిరుపతిరెడ్డి, అజయ్ గౌడ్, విష్ణువర్ధన్, కంచి ఆంజనేయులు, నారాయణ రాయ రాయన్న, నవీన్ చారి, విజయసాగర్ ఎద్దుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం పై నిషేధాజ్ఞలు

- అనుమతి లేని డ్రోన్,డిజె సౌండ్స్ పై చర్యలు

**టీ మీడియా,జనవరి 3,గోదావరిఖని :**



సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల,పెద్దపల్లి జోన్ లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, ఐపీఎస్.,(ఐజి) ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని తెలపడం జరిగింది. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమి%శీ%చి%శీ%దని, మద్యం ప్రియులు ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-01-2025 నుండి 01-02-2025 వరకు కొనసాగుతాయని తెలిపారు.పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతియ న్యాయ సంహిత) బిఎన్ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం,1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.

డీజే ,డ్రోన్ లపై నిషేధాజ్ఞలు పొడగింపు...రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్ లలో డీజే సౌండ్ ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడగించమని అని సిపి తెలిపారు.ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు.చిన్నపిల్లలు వృద్ధులు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్ లతో కూడిన డిజె సౌండ్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధించారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ,ప్రదర్శనల కోసం డీజే సౌండ్లు వినియోగిస్తున్నారని అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి ల అనుమతి పొందాలని సూచించారు.ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు 01-01-2025 నుండి 01-02-2025 వరకు కొనసాగుతాయని తెలిపారు పరిస్థితుల ప్రభావం ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతియ న్యాయ సంహిత) బిఎన్ఎస్ 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం,1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి హెచ్చరించారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జారే

**టీ మీడియా,జనవరి 3,చంద్రుగొండ.....**

అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత గ్రామమైన మొహమ్మద్ నగర్ ను పంచాయతీగా మార్చాలని ఆ గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే మొహమ్మద్ నగర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే రాకను గమనించిన గ్రామస్తులు తమ ఊరిని పంచాయతీగా మార్చాలన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. తమ పంచాయతీ కార్యాలయం దూరంగా ఉండడంతో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గ్రామ అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రానికి మొహమ్మద్ నగర్ మారుమూల గా ఉన్నదని, కనీసం పంచాయతీ కార్యాలయానికి మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని దాంతో ప్రతి చిన్న పనికి ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేతో చెప్పారు. గ్రామ అభివృద్ధికి అనుగుణంగా పంచాయతీగా మారిస్తే మరింత బాగుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అనంతరం తిప్పలపల్లి గ్రామంలో శుభసాయంత్రం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి నుంచి చెరుకట్ట మీదుగా తిప్పనపల్లి గ్రామం కలిపే విధంగా బీటి,సిసి రోడ్లు నిర్మించాలని ముస్లిం సోదరులు, గ్రామస్తులు కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## రైతుబంధు లో అవినీతి జరిగితే విచారణకు రెడీ

(మొదటిపేజీ తరువాయి...)

ఉందన్నారు. రైతులు మళ్లీ కొత్తగా ఎందుకు ప్రమాణ పత్రాలు ఇవ్వాలని కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ సబ్‌కమిటీ ఐదేళ్లు పోయాక నివేదిక ఇస్తుందని మాకు సమాచారం అందిందని ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు ఎప్పటినుంచి రైతు భరోసా ఇస్తారని మరోసారి ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రూపాయి కూడా రైతుబంధు ఇవ్వలేదు. రైతును రాజును చేస్తామని ఎన్నికల ముందు చెప్పారు. రైతు డిక్లరేషన్ పేరుతో చాలా హామీలు ఇచ్చారు. 1.6 కోట్ల మంది ప్రజాపాలన దరఖాస్తులు చేసుకున్నారు. రైతులు ప్రమాణ పత్రాలు ఇవ్వాలని ఇప్పుడు అడుగుతున్నారు. రైతు శాసించాలని కేసీఆర్ అన్నారు.. రైతులు యాచించాలని కాంగ్రెస్ అంటుంది. వానాకాలంలో ఎగ్గొట్టిన రైతుబంధు కూడా ఇవ్వాల్సిందే. రైతు రుణమాఫీ చేశామని చెప్తున్నారు. గ్రామాల వారిగా రుణమాఫీ లిస్ట్ తెచ్చి పెట్టాలి. రైతుభరోసా ఎవరికి ఇస్తారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలి. రైతుబంధును బొందపెట్టాలని ప్రభుత్వం చూస్తోంది.

కేబినెట్ నిర్ణయం తర్వాత బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటన : రేపటి కేబినెట్‌లో ప్రభుత్వం అన్ని ఆలోచించి అందరి రైతుల పక్షాన నిర్ణయం తీసుకోవాలని కేటీఆర్ చెప్పారు. రైతులను భయపెట్టే కుట్రను అడ్డుకుంటామన్నారు. చిత్తశుద్ధి ఉంటే రైతుబంధు ఎక్కడ దుర్వినియోగం అయిందో ప్రభుత్వం వివరాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీజేపీ ఒకే లైన్‌లో ఉంటే చేసేదేమీ లేదని అన్నారు. కేబినెట్ నిర్ణయం తర్వాత బీఆర్ఎస్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ప్రమాణ పత్రాలు, దరఖాస్తులు వరంగల్ డిక్లరేషన్‌లో పెట్టారా అంటూ ప్రశ్నించారు. చేత కాకపోతే రైతుల కాళ్లు పట్టుకొని క్షమాపణ అడగాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.



## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

- మాజీ మంత్రి మాతంగి నరసయ్య తనయ, మాతంగి సునీతకు ఘన సన్మానం

**టీ మీడియా,జనవరి 3,గోదావరిఖని :**

చదువుల తల్లి సావిత్రిబాయి పూలేను స్ఫూర్తి గా,తీసుకొని, సమాజానికి సేవ చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, మామిడిపెల్లి బాపయ్య పిలుపునిచ్చారు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో,శుక్రవారం గోదావరిఖని పట్టణంలోని తెలంగాణ అంబేద్కర్ భవన్లో మాత సావిత్రిబాయి పూలే 194వ జయంతిని ఘనంగా నిర్వహించారు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మామిడిపల్లి బాపయ్య మాజీ మంత్రివర్యులు మాతంగి నరసయ్య,తనయ ప్రముఖ సామాజిక సేవకురాలు, మాతంగి సునీత మాట్లాడారు..సమాజంలో చదువు ద్వారానే మహిళలు అనగారిన వర్గాలలో మార్పు కలుగుతుందని తాను అవమాన పడి కూడా సమాజానికి సేవచేసిన గొప్ప త్యాగమూర్తి సాబవిత్రుభాయి పూలే అన్నారు,ఆమె స్ఫూర్తిగా తీసుకొని సమాజానికి సేవ చేయాలన్నారు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇరువురాల క్రిష్టయ్య తెలంగాణ అంబేద్కర్,పవన్ నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ శనిగరపు రామస్వామి,ఆలయ ఫౌండేషన్ సభ్యులు ఆర్న కొండ వెంకటేశ్వర్లు,ఏఐటీయూసీ అధ్యక్షులు ఎంఏ కరీం,జనరల్ సెక్రటరీ శనిగరం చంద్రశేఖర్ గోదావరి కళాశాల సమైక్య సలహాదారులు కాశి పాక రాజమౌళి,ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు,మధ్యల దినేష్,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్లు, దుబాసి బొందయ్య, గద్దల శశిభూషణ్,పెగడపల్లి నారాయణ,రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, కన్వీనర్,బూడిద మహేందర్,కో కన్వీనర్లు పంజా అశోక్,గొర్రె నర్సింగరావు,పుల్లూరు మహేందర్,జనగామ మహేందర్,కవ్వంపల్లి, లింగయ్య,మహిళ నాయకురాలు బూడిద భాగ్యరేఖ,జీనత్ బేగం, సుజాత,మాధవి రాజేశ్వరి, సాంబశివరావు,రాజేష్, దేవన్న,అంజన్న,ఖలీల్ రాజేందర్,తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం మాజీ మంత్రి మాతంగి నరసయ్య తనయ మాతంగి సునితను,మహిళా సంఘం నాయకురాలు జీనోత్, బేగంను శాలువతో ఘనంగా సన్మానించారు.